# అరబ్బుల బేరం

"అరేయి రామాయి, ఇట్రారా! టడ్బైన్ చిగరెట్లిత్తుండాగ్రా స్టోర్లో!" అన్నాడు అమావాళ్య కిట్టాయి. ఇద్దరూ సిగరెట్లు తీసుకుని నంబరు 3 రెజిమెంటుకు పోయే తోవలో వున్న బ్రిడ్జిమీద కూర్చున్నారు.

"అరేయి కిట్టాయి! నీవు జమేదారు సాబు దగ్గర ఆడర్లీ పజ్జేత్తుండావు గదా, యీ మూడు రోజులూ నీకు చుట్టీయేగా?"

"అవున్రా. ఆ మూడ్రోజులే గాదంట్రా. మళ్ళీ నిన్నటి కాయన వచ్చాడుగా!"

"ఎక్కడికి కెళ్ళాడేంరా?"

"ఎడారి వూళ్ళో మంచి ఒంటె లుంటాయిట్రా, మన గన్నులు తీసుకుపోటానికి రెండొంటెలు పట్రావాలని ఆయన కెయిరో

వదిలి మూడునాళ్ళయిందిరా. సివరకి పట్టుకొచ్చాడుగా. వొచ్చిం తర్వాత మా తమాసా కత సెప్పాడ్రా."

"ఏందీ? ఏమయిందేంరా ?"

"ఆయన కత ఇట్టా సెప్పాడ్రా."

"ఒకేయి కిట్టాయి! అడివికి పోయి ఎడారులో పడ్డానురా. ఎడార్లోంచి పోగా పోగా ఓ వూరు కనబడ్డదిరా. ఈ కెయిరోలో సంవత్సరం నుంచీ కూర్చుని కూర్చుని యిసిగిపోయిన నాకు ఆ ఎడారి ప్రయాణం ఆనందం గానే వుందిగాని కంపెనీ డ్యూటీ వుందిగా - రెండు ఒంటెలను పట్టుకుని రావాలి. పన్నెండూళ్ళు తిరిగినా దొరకలా. చివరకో వూళ్ళో ప్రవేశిస్తూ అబద్దాలు చెప్పయినా సరే రెండు వొంటెలను కొనాలనుకున్నా.

వూళ్ళో ప్రవేశిస్తుండగానే ఓ అరబ్బీ కనబడ్డాడు.

"నీకు శాంతి కలుగుగాక" అన్నాను.

"నీకు గూడా శాంతి కలుగు గాక, అల్లా నీకు ఆరోగ్య మిచ్చుగాక" అన్నాడు వాడు.

బాగానే వుందనుకున్నాను. వాడికి దగ్గరగానే అరుగొకటుంటే కూర్చున్నాను. సిగరెట్టు ముట్టించాను.

"ఈ వూరు గురించి చాలా గొప్పగా విన్నాను" అన్నాను. [ఆ వూరు పేరే ఎవరూ చెప్పలా నాకు.]

"ఈ వూర్ని గురించి చాలామంది మాటాడుతారు. ఈ వూరికి మాలావు పేరుంది" అన్నాడు.

"కెయిరోలో గొప్ప షాపు పెట్టిన అహమ్మదు బిన్ రషీదు గారివల్ల అసలీ వూరు పేరు విన్నాను."

"ఆఁ! అహమ్మద్ బిన్‌రషీదా? అవును!" అన్నాడు.

అప్పుడే ఎక్కడ్నుంచి వచ్చారో మరిద్దరు అరబ్బులు ముసుగులేసు కుని ఎవరా యీ కొత్తెం అన్నట్లు నన్ను చూస్తూ వచ్చి నిలబడ్డారు. నాకు దణ్ణా లెట్టినట్టుగా తలలు వంచి ఎత్తారు. కాసేపు తర్వాత మొదటి అరబ్బు పక్కనే కూర్చున్నారు. నేనేదైనా కథ చెబుతున్నా ననుకున్నారో ఏమిటో! ఎడారివాళ్ళు కథలంటే చెవులు పాచి వింటారు.

"అహమ్మదు దిదే వూరట ఒకప్పుడు. అబ్బో చాలాకాలం క్రిందట" [నా అబద్ధాలకు భగవంతుడేమీ చెయ్యడుగదా అనుకున్నా.] అతనిప్పుడు చాలా వృద్ధు. అందువల్ల ఏ కొద్దిమందికో తప్ప అతనంటే ఎవరికీ జ్ఞాపకం ఉండదేమో అనుకుంటా."

"అహమ్మదా? అవును తమరు సత్యమే చెపుతున్నారు. చాలా సంవ త్సరాల క్రింద అహమ్మదీ వూరు వొదిలిపోయాడు. అతనంటే జ్ఞాపకం వున్న వాళ్ళున్నారో లేదో కూడా. నే గూడా అతన్ని గురించి యీ మధ్య యెప్పుడూ అనుకోనేలేదు" అన్నాడు మొదటి అరబ్బీ.

"వల్లహీ! ఆ మాట సత్యమే!" అన్నాడు రెండో అరబ్బీ. "అతన్ని గురించి అంతా మరిచిపోయినారు. నిజానికి అతను మా నాయనకు తమ్ముడే కానట్లయితే నే గూడా మరిసిపోయేవాడ్నే!"

ఆ అబద్ధాలు నన్ను మించినట్లుగా వున్నాయి. ఏంచేస్తానూ? అట్లాగే మాట్లాడాను. "ఈ వూళ్ళో వున్న వొంటెలు బలంలోనూ జాతిలోనూ మంచి గొప్పవని అహమ్మదు చెప్పినాడు నాకు" అన్నాను.

"అతను సత్యమునే మాటాడాడు. ప్రపంచంలో వున్న వొంటెలలో అత్యుత్తమమైన వీ వూరు నుంచేగా రవాణా? ఈ వూరే వొంటెల వూరు" అన్నాడు మొదటి అరబ్బీ.

"అవును అహమ్మదు సత్యమే చెప్పాడు. మరి యే వూరిలోనూ ఇంత మంచి వొంటెలు దొరకవు" అన్నాడు రెండో అరబ్బీ.

కొంచెం సేపూరుకున్నాం. ఇంకే రకంగా మాటాడుదామా అని అనుకుంటున్నాను. "ఇల్లాంటి గొప్ప వొంటెల కోసం నాబోటి వాళ్ళు చాలా మంది వుంటారు కాబోలునేం? ఎన్నాళ్ళో వుండీ వుండీ బేరమాడితేగాని దొరకవేమోనేం ?" అన్నాను.

"హాఫ్ యీఫరాహ్ ! అల్లా నీ మీద దయకలిగి వున్నాడు. తమరు సెలవిస్తున్న మాదిరి రెండు వొంటెలు నిజానికి నా వద్దే వున్నాయి. లేక పోతే తమరు సెలవిచ్చిన ప్రకారం ఇప్పుడప్పుడే మీకేమీ దొరికేవి కావు" అన్నాడు మొదటి అరబ్బీ.

"ఆఁ తమరు చాలా అదృష్టవంతులు !" అన్నాడు రెండో అరబ్బీ. ఈ దారినే పోయేవానికీ విధంగా అనుకున్నది అనుకూలపడడం అల్లావల్లేగదా, అల్లా మహాత్మ్యం ఎటువంటిదీ అన్నట్లు మూడో అరబ్బీ తల వూపాడు.

"హా! రెండు గొప్ప వొంటెలు, పనియేమీ లేకుండా మీ యింట్లో దాణా మేస్తున్నాయంటే నా గుండె చెరువై పోతున్నది. వాటిని నేను కొనేవాడ్నేగాని తోలుకెళ్ళడం నాకు చాతగాదు. డబ్బిస్తే నాతో తోలుకొచ్చేవాళ్ళు మీ వూళ్ళో లేరు కాబోలు. ఏం చేస్తాం?" అన్నాను.

"ఆఁ ! తమరు సెలవిచ్చినట్లు ఆ మాట చాలా దుఃఖకరమే" నన్నాడు మొదటి అరబ్బీ.

"ఎవరైనా ఒక్కడు చాలు, వీటిని ఎడారి చివరిదాకా తోలుకొస్తే, వీటి శక్తి సామర్థ్యాలూ పోకడలూ చూస్తూ తెలుసుకొని కొనేవాడ్నే. నా అంతట నేను తోలుకెళ్ళలేను."

"తమరు సెలవిచ్చినట్లు వొంటెలు తోలడం తెలిసినవాడూ, ఎడారిని బాగా ఎరిగినవాడూ అయితేతప్ప లేకపోతే, కష్టమే" నన్నాడు.

"ఓవేళ మీ 'ఉమ్దా' (గ్రామ పెద్ద)కు అటువంటి మనిషెవరైనా ఉన్నాడని తెలుసేమో!" అంటూ మిగతా యిద్దరు అరబ్బుల వంకా తిరిగి "మీ వద్దనున్న మహత్తరమైన జ్ఞాన సంపదవల్ల మీకేమీ తెలీదూ. అటువంటివా డెవడైనా వున్నాడో లేదో?" అన్నాను.

"వల్లహీ! నా చెల్లెలి కొడుకుకీ వొంటెలు తోలడంలో గొప్ప పేరు లేదూ? వానికీ ఎడారి మార్గాలూ గుట్టుమట్లన్నీ తెలిసినవాడని ప్రఖ్యాతి లేదూ? అతగాడీ మహాపురుషుని సాహసంవల్ల లాభకారికాడూ? ఏమంటారు?" అన్నాడు మొదటి అరబ్బీ మిగతా యిద్దరితో.

"నీవు చెప్పింది సత్యమే. అతగానికీ యెడారి విషయమంతా బాగా తెలుసు. అతను దొరకడమంటే అల్లా దయతలచడ మన్నమాటే!" నన్నారా యిద్దరూ గడ్డాలు నిమురుకుంటూ.

"అల్హాందూ, ఇలిల్లా! ఈ సదుపాయం కలిగినందుకు అల్లాకు వందనాలు!" అని నేను నిట్టూర్పు విడిచాను.

వస్తుంటే దారి పొడుగూతా నాలుగు రెళ్లెక్కువ ధర పెట్టానన్నారు చాలామంది—వెధవలు! "ఒరేయి కిట్టాయి, తెలీని బేరాలకు పోకూడదురా" అన్నాడురా" జమేదారు సాబు.

"పాపం ఆయనేం చేత్తాడ్రా? యుద్ధంలో బేరాలేందిరా, యాడికి సిక్కింది అడికే."

"మనకూ సిక్కుతున్నారు గాదంట్రా పిట్టలు."

"అందుకనే యుద్ధమైపోయినా అరేబియా వొదిలిపోన్రా నేను" అన్నాడు రామాయి.